# పుట్టింటి సారె

ఈ నవీన నాగరికతా ప్రపంచంలో ప్రేమ వివాహం చేసుకున్న ఆ దంపతు లిద్దరిమధ్యా పరస్పరం మనస్పర్థలు ప్రబల్లడం—దాంతో విశాలాక్షి అలిగి పుట్టింటికెళిపోడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది.

ఆరాతియ్యాగా తేలిన విషయమేమిటీ అంటే కట్నకానుకలు పుచ్చుకోకుండా విశాలాక్షిని పెళ్ళిచేసుకున్నందుకు రంగధాముడు ఇప్పుడు విచారిస్తున్నాడని.

అది ప్రేమించి చేసుకున్న పెళ్లి కాబట్టి పెళ్ళిసందర్భంలో తను కట్నకానుకలు పుచ్చుకోనేటందుకు వీలులేకపోయింది.

పిల్లని కాపరానికి పంపేటప్పుడయినా ఎంతో కొంత తనకు వాళ్లు ముట్టచెప్పకపోడం చాలా అసందర్భం. ఈ విషయమై రంగధాముడు అప్పట్లో అంతగా బాధపడలేదుగానీ ఇప్పుడు చాలా బాధపడుతున్నాడు. ఇక పెళ్ళాన్ని దెప్పడం మొదలెట్టేడు — "మీ నాన్న ఒట్టి పక్కా!—అల్లుడి మంచితనాన్ని అర్థంచేసుకొనే శక్తిలేదు మీ నాన్నకి. ఉండుండు మీ నాన్నకి నా మజా చూపెడతాను." ఈ ధోరణిలో మాట్లాడడం ప్రారంభించేడు. చాలా నొచ్చుకుంది విశాలాక్షి. మాటా మాటా అనుకోడం జరిగింది. కోపంతో పుట్టింటికెళిపోయింది విశాలాక్షి.

ఒకనాడు రంగధాముడు ఈ విషయాన్నంతటినీ అమ్మమ్మతో చెప్పేడు.

"మరేం ఫరవాలేదు నాయనా! — [illegible] పాటు నీ పెళ్ళాం ఇవాళో రేపో చక్కా తిరిగొస్తుందిలే!—మరి రాదేమోనని బెంగపెట్టుకోకు. వెనకటికో కవి వ్రాసేడు 'సుభద్రసారె' అని ఓ మంచిపాట. వాళ్లు తగూలాంటిదే మీ తగూకూడాను ఆ పాటపాడతాను విను," అని పాడడం మొదలెట్టింది మా అమ్మమ్మ.

పాన్పుమీదా పవళించె పద్మనాభులు
ఆకిదిగో పోకిదిగో అడకత్తెరేల!
సున్నపుకాయేల చుట్టియ్యనేల
అనగపారుడు నవ్వి అతివ కిట్లనియె:
'పున్నమినాడైన గార్లు వండూకోని
అల్లుడా రమ్మనీ పిలిచారె మీవాళ్లు
కనుమనాడైనాను గారెలొండూకోని
కాముడా రమ్మని పిలచారెమీవాళ్లు?'
అని అర్జునుడన్నాడు.

పుట్టింటివారినలా అంటే సహించలేకపోయింది సుభద్ర—అంచేత...

"మావాళ్లు పేదలూ మాకేమిగలదు?
పెట్టగల పెద్దింట పెళ్లాడితేను
అచ్చటలు ముచ్చటలు
[అన్నియును తీరు!"

అని సుభద్ర అనేసరికి అర్జునుడికి కోపం వచ్చింది.

అతివ పల్కులు విని గుడ్లెఱ్ఱజేసి
ఎడమ మీసం దువ్వి పాంకోళ్లు ఎత్తి
పాంకోళ్లతో తన్ని ఫక్కునా నవ్వె.

---

ఆకుండి
నారాయణమూర్తి

---

అవమాన భారంతో క్రుంగిపోయింది సుభద్ర, రోషం వచ్చిందామెకు.

...ఒంటిసొమ్ములుతీసి భరిణెలోనుంచి
మాసిన బట్టలు మడుగుల్లు విప్పి
మువ్వలా బాలుణ్ణి చంక బెట్టూకోని
వెళ్లేను సుభద్ర అన్నవాడలకు.
వాకిట్లో వారన్న శయనించియుండె
అంతపురీశని వదిన ఎదురుగవచ్చి
ఆడబిడ్డను చూచి అతిజాలినొంది
"నిద్రపోతున్నావు నీలవర్ణుండ
నీ చెల్లె వచ్చింది నిద్ర లేవయ్య!"

అని లేపిందామె. కృష్ణుడు చెల్లెలికేసి చూసి ఆశ్చర్యపోయి ఇలా అడిగేడు...

"నాముద్దుచెల్లెలా రావమ్మ సుభద్ర
యేనుగులు యుండంగ గుఱ్ఱాలు
[యుండంగ
పోదాలుయుండగా పల్లకీలుండంగ
బంటులుఉండంగ, దాసిసాలుండంగ
కాలినడకలతోను ఒంటరిగ నీవు
తడబడుచు వచ్చుటకు కారణం
[బేమి?"

అని అడిగేడు. యథార్థ విషయాల నన్నింటినీ అన్నగారితో చెప్పింది సుభద్ర. అప్పుడు కృష్ణుడు...

చెల్లెలిని ఓదార్చి చేరంగదీసి
కంట తడిబెట్టకుమి కాంతరో నీవు
దండెమున ఉన్నాయి క్రొత్తచీరెల్లు
ఇవుగోన చెల్లెలా నీకు ఆభరణాలు
("యిచ్చె" అని పాడాలి.)
పెట్టెలో ఉన్నాయి పట్టుచీరెల్లు
[యిచ్చె!
గూట్లోను ఉన్నాయి గుండుగిన్నెల్లు
[యిచ్చె!
అటకమీదున్నాయి అంచుబిందెలు
[యిచ్చె!
భరణిలో ఉన్నాయి పతకాల పేర్లు
[యిచ్చె!
సావిట్లో ఉన్నాయి కావడిపెట్టెలు
[యిచ్చె!
అదుగో సరతనాలకోళ్లపట్టెమంచమ్ము
[యిచ్చె!
అనుచుకృష్ణుడుఇచ్చెనతులకడకంపె"

"ఈ సంరంజామాతో అత్తగారింటికి భర్తగారి కళ్లు జిగేల్ మనేటట్టు చెయ్యాలనుకుంది సుభద్ర. వెళ్ళిపోయేముందు వదినల దగ్గరకెళ్ళి...

"'పెద్దింటి పెద్దవదిన
పోయి వచ్చెదనూ'
'పోయి మీ అత్తింట
బుద్ధిగలిగుండు.'
'చిన్నింటి చిన్నవదిన
పోయి వచ్చెదనూ'



బొమ్మలకొలువులో సీతారాములు

—ఫోటో: ఎస్. గిరిధర్)

'పోయి మీ అత్తింట
బుద్ధి గలిగుండు'
"మురిపెంపు ముద్దు వదిన
పోయివచ్చెదనూ'
'పోయి కొడుకుని
గని ఎత్తుకొనిరమ్మా'
'బుద్ధి గల బుద్ధివదిన
పోయి వచ్చెదనూ'
ముద్దులా పుత్రుని
ఎత్తుకొని రమ్మ'"......

ఆడబిడ్డ ఇంటికొచ్చి ఏమయినా పట్టుకుపోతూవుంటే...తమ ఈసును వ్యక్తంచేస్తూ ...కొపడడం వదినల లక్షణంకదా మరి!...

..."పాలన్నీ పిడుచుకు
పొమ్మ ఓముద్దుగుమ్మా
ఎండే ధాన్యంబు ఎత్తుకొనిపొమ్మ
వండే వంటకము
ఎత్తుకొనిపొమ్మ
కాళ్లమట్టెల జోడు
దీసుకొనిపొమ్మ......

అని ఈ విధంగా గుజగుజలాడేరు.

"అనుచు గుజగుజలాడ
అతివదుఃఖించి
అన్నరో వింటివా
ఆలిమాటలను"......

అని అన్నగారితో ఫిర్యాదుచేసింది. ఆ పరమాత్మ కప్పా విప్పా సమర్థుడుకదా మరి. చెల్లెల్ని ఓదార్చి నవరత్నాభరణాలు, ఆవులు, అశ్వాలూ, సమస్తమయిన దినుసులు ఇచ్చి, దాసదాసీజనాన్ని తోడు పంపించి రత్నాలపల్లకీలోకి సుభద్రను ఆ పరమాత్మ ఎక్కించేడు. ఇది నాయినా కథ!"—అని ముగించింది అమ్మమ్మ.

"ఆ కృష్ణుడు ఇవన్నీ ముందే చెల్లెలికిస్తే చాలా బాగుండిపోయేది. ఈ పేచీయే రాకపోయుండేది!" అన్నాడు రంగధాముడు అతి తెలివిగా.

"కొంచెమయినా ఆలోచించకుండా చాలా తెలివితక్కువ అభిప్రాయాన్ని వెలిబుచ్చేవు నాయనా. పెద్దన్న బలరాముడికి తెలియకుండా, అతని అంగీకారం లేకుండా అర్జునిడిని వలచి వివాహమాడిన సుభద్ర సారె తీసుకుపోయే అవకాశముందంటావా? ...లేదు. అంచేతే ఈ సన్నివేశాన్ని కవి ఊహించి ఇంత మనోహరంగా పాట వ్రాశాడు" అంది అమ్మమ్మ.

* * *

బోలెడు లగేజితో విశాలాక్షి ఆమె తండ్రితో సహా వచ్చేసరికి, రంగధాముడు చాలా ఆశ్చర్యపోయేడు!—

"మాడం పెల్లుడు గారూ!—కార్యంచేసి సక్రమంగా శాస్త్రోక్తంగా పిల్లని మీ ఇంటికి పంపించేటంతటివరకూ మీరు ఆగలేకపోడం వల్ల, అప్పట్లో సారెసామాను పెట్టేటందుకవకాశం లేకపోయింది. మీరు నవీన నాగరికత కలవారనీ, ఆదర్శవంతులనీ అనుకొని ఇంతవరకూ ఏవీ పెట్టలేదు. ఆలస్యానికి మన్నించండి!" అని మామగా రనేసరికి రంగధాముడు చాలా సిగ్గుపడిపోయి ముఖం క్రిందికి దించేసుకున్నాడు.

★